క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి సంబంధించిన మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ ఏటీఎస్ శాంతకుమారి శుక్రవారం తెలిపారు. గుత్తావారిపాలెం, తూర్పుపాలెం, పెదపాలెం, గొరిగపూడి, పెదపులివర్రు ఓలేరు, కన్నెగంటివారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాకు విఘాతం కలుగుతుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి చెరువులను నింపుకోవాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: తాగునీటి ఎద్దడి నివారణకు చెరువులు నింపుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గణపవరం తాగునీటి చెరువును నీటితో నింపే పనులను శుక్రవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలకు నీరు వస్తున్నందున చెరువును పూర్తి స్థాయిలో నీటితో నింపుకోవాలని చెప్పారు. గణపవరం పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు కొళాయిల ద్వారా నీటి సరఫరా జరగాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

ముగిసిన కుట్టు శిక్షణ శిబిరం



కర్లపాలెం: మహిళలు కుట్లు, అల్లికల ద్వారా స్వశక్తితో ఆదాయం సమకూర్చుకోవచ్చునని గుంటూరు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ పి.సందీప్‌బాబు చెప్పారు. కర్లపాలెం రామకృష్ణ సేవా సమితిలో ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కుట్టు శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కర్లపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ బ్యాంక్ ప్రతినిధి బెనర్జి, రామకృష్ణ సేవా సమితి సభ్యులు సుబ్బారావు, సాంబయ్య, పోలీస్‌రావు, కోటేశ్వరరావు, టైలరింగ్ మాస్టర్ గోపి, మహిళలు తదితరులు ఉన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

అమర్తలూరు(వేమూరు): భార్యాభర్తల గొడవ వల్ల భర్త పెదపూడి హనుమంత్(40) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రంలోని పెదపూడి హనుమంతరావు ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం భార్య బట్టలు ఉతుక్కొని రావటానికి కాలువకు వెళ్లింది. బట్టలు ఉతుక్కొని వచ్చేసరికి ఇంటి తలుపులు వేసి ఉండటం, తలుపులు తీయకపోవడంతో భార్య కిటికిలోంచి హనుమంత్ ఉరి వేసుకొని ఉండటం చూసి ఇంటి చుట్టు పక్కల వ్యక్తులను పిలిచింది. దీంతో వారు తలుపులు పగలగొట్టి ఇంటిలోకి వెళ్లి కిందకు దించారు. గ్రామస్తులు 108 వాహనంకు ఫోన్ చేశారు. 108 వాహన సిబ్బంది మృతి చెందాడని నిర్ధారణ చేశారు. భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసామని ఎస్‌ఐ రవితేజ తెలిపారు.

శాకంబరిగా పార్వతి అమ్మవారు



చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాడ మాసం పురస్కరించుకుని పార్వతి అమ్మవారిని శాకంబరిగా అర్చకులు మామిళ్ల శ్రీనివాసరావు శుక్రవారం అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు ఇళయరాజా పాటల సంగీత విభావరి

తెనాలి: వివిధ భాషల్లో ఇప్పటివరకు 1,523 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా 50వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా స్వరలయ వేదిక ఆధ్వర్యంలో తెనాలిలో ఇళయరాజా సినీసంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆహ్వానపత్రికను ఆయన ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరుపుతున్నట్లు తెలిపారు. సత్యవర్ధన్, విష్ణుప్రియ, సాంబశివరావు, శిరీష, సత్యనారాయణలు ఇళయరాజా సంగీత దర్శకత్వం వహించిన పాటలను గానం చేస్తారని తెలిపారు.

శిథిలావస్థలో పార్కులు

- మందు బాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని మునిసిపల్ ఉన్నతాధికారులు

బాపట్ల: పార్కులంటే.. పిల్లలతో సరదాగా కాసేపు ఆహ్లాదంగా గడిపే ప్రదేశం.. కానీ ఇక్కడ మాత్రం అసాంఘిక కార్యకలాపాల నిలయంగా మారింది. పిల్లలను రారమ్మని ఆహ్వానించే ఊయలలు విరిగి మూలకు చేరాయి. వాకర్లను అక్కున చేర్చుకుని సేద తీర్చే బెంచీలు ముక్కలయ్యాయి. ఆహ్లాదానికి ఆలంబనగా మారే పార్కు పరిసరాలు.. ముళ్ల చెట్లు పెరిగి అడ్డమైన పనులకు ఆవాసమయ్యాయి. ఇదీ బాపట్ల జిల్లా కేంద్రంలోని పార్కుల దుస్థితి.



పేయింటర్స్ కాలనీలో పార్కు పరిస్థితి

చంద్రకళ పార్కు దుస్థితి ఇలా

బాపట్ల జిల్లా కేంద్రంగా అవతరించాక రైల్వే స్టేషన్ ప్రాంతంలో పార్కు నిర్మించారు. ఇది పిల్లలకు ఎంతో ఆహ్లాదకరంగా మారింది. ఈ పార్కు నిర్మాణంతో ఆ ప్రాంతం కూడా సుందరంగా తయారైంది. అప్పుడు ఉన్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో చంద్రకళ పార్కు నిర్మాణానికి పునాది పడింది. ఇది బాపట్లకు సరికొత్త శోభ తీసుకొచ్చింది. అయితే బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ మున్సిపల్ అధికారులు పార్కులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న చంద్రకళ పార్కు గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్కు నిర్వహణపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దాని ఫలితంగా శిథిలావస్థకు చేరుకుంది. సాయంత్రం కాగానే మందు బాబులకు అడ్డాగా మారింది.

పట్టించుకునే నాథుడు లేడు

స్థానిక పెయింటర్సు కాలనీలో పార్కు నిర్మించారు. ఈ పార్కులో అనేక రకాల పిల్లల ఆట వస్తువులు ఉన్నాయి. అదే సమయంలో వాకర్స్ సేద తీరడానికి బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు ఈ పార్కు నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడంతో ఇప్పుడు అవన్నీ మూలకు చేరాయి. ఇదే పార్కు పరిసరాలలో బిల్డింగ్, వెల్డింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ కార్మికుల కార్యాలయాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ పార్కు ఆలనాపాలనా చూసే నాథుడు లేడు.



చంద్రకళ పార్కు దుస్థితి

పార్కు నిర్వహణకు ఇద్దరు కార్మికులు

సదరు పార్కు వినియోగంలో లేదు. అయినప్పటికీ ఈ పార్కులో పని చేసేందుకు ప్రతి రోజూ ఇద్దరు కార్మికులను కేటాయించారు. వీరు పార్కుకు వచ్చి వెళ్లడమే విధి నిర్వహణ. అయితే పార్కులో ఏం జరుగుతుంది..? పార్కులో శుభ్రం చేయడం వంటి పనులు చేయడం లేదు. అదే సమయంలో మునిసిపల్ ఉన్నతాధికారులు కనీసం పార్కు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ దుస్థితికి చేరిందని ప్రజలు మండిపడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ప్రస్తుతం పార్కులో ముళ్ల పొదలు పెరిగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందుబాబులు ప్రతి రోజూ మద్యం సేవిస్తూ నానా హంగామా చేస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయి. మరో వైపు జూదం ఇతర కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. వీటిపై మున్సిపల్ అధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. దీంతో ఆ ప్రాంతంలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన సదస్సు

అమర్తలూరు(వేమూరు): ప్రతి వ్యక్తి సంపాదించిన డబ్బును ప్రభుత్వ బ్యాంక్‌ల్లో దాచుకోవాలని ఎంపీడీవో మారుతి శేషాంబ అన్నారు. మండల కేంద్రంలోని ది పెన్షనర్స్ అసోసియేషన్ మీటింగ్ హాలులో భారతీయ రిజర్వు బ్యాంక్ ఆధ్వర్యంలో ల్యాంప్ సంస్థ డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో కూడిన బ్యాంకు లావాదేవీలు నడపాలన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ పావని మాట్లాడుతూ బ్యాంక్‌లో కచ్చితమైన లావాదేవీలు నడపాలన్నారు. ప్రభుత్వ బ్యాంక్‌లలో తక్కువ వడ్డీలకే రుణాలు పొందవచ్చున్నారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా సౌకర్యాలను కలిగి ఉండాలని, సైబర్ నేరస్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాంచారయ్య, బుల్లిబాబు, శోభారాణి, యానిమేటర్లు పాల్గొన్నారు.



ల్యాంప్ సంస్థ అవగాహన సదస్సులో ఎంపీపీ మారుతి శేషాంబ

● ఇదేనా స్వచ్ఛాంధ్ర..




యలవర్రు గ్రామంలో పంచాయతీ రోడ్డు పక్కన వేసిన చెత్తచెదారం

అమర్తలూరు: ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అయితే దీని గురించి అధికారులు మరిచి పోయారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో సేకరించిన వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు పక్కన వేస్తున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రామంలో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ రోడ్డు గుంతలో వర్షపు నీరు నిలిచిపోయిన అధికారులు పట్టించుకోవడం లేదని, ఇదేనా స్వచ్ఛాంధ్ర.. అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులు రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహిత తెనాలిలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ రహిత తెనాలి కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణంధ్ర– స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వలన అనేక అనార్థాలు ఉన్నాయని, దానిని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉదయం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్, బోసురోడ్డు, చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు అవగాహన ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తహసీల్దార్ గోపాలకృష్ణ, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు పాల్గొంటారని చెప్పారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వారిపై దాడులు కూడా చేయనున్నట్లు ప్రకటించారు.

- స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా బహిరంగ మల మూత్ర విసర్జనలో రాష్ట్రస్థాయిలో తెనాలికి 27వ ర్యాంకు వచ్చిందని తెలిపారు. జాతీయస్థాయిలో 547వ ర్యాంకు లభించిందన్నారు. అలాగే గార్బేజ్ కలెక్షన్‌లో కూడా ఉత్తమ ర్యాంకు లభించిందన్నారు. తెనాలి పట్టణాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మహా రుద్రయాగం



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ త్రయాహ్నిక పూర్వక చండీ సహిత మహా రుద్రయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మూర్తులు పొన్నూరు షణ్ముఖ రఘు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దేవాలయ ప్రదక్షిణ, మూల విరాట్‌కు అర్చన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, గోపూజ, అంకురారోపణ, విశేష అర్చనలు, అగ్నిప్రతిష్ఠాపన, హోమాలు, నిరాజన మంత్రపుష్పములను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

గ్రంథాలయాధికారికి సత్కారం

తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని పురపాలక సంఘ మహిళా సాధికార భవనం(పాత మహిళా మండలి)లోని గ్రంథాలయంలో అధికారిగా విధులు నిర్వహిస్తూ, పెదరావూరు బదిలీ అయిన కోడూరు అంజనీకుమారి వీడ్కోలు అభినందన సభను శుక్రవారం గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై, బదిలీపై వెళుతున్న అంజనీదేవి అందించిన సేవలను ప్రశంసించారు. అదేవిధంగా కొలకలూరు నుంచి మహిళా సాధికారత భవనం గ్రంథాలయాధికారిగా బదిలీపై వచ్చిన సుజాతకు అభినందనలు తెలిపారు. మెప్మా సీఎంఎం విజయలక్ష్మీ, మండల విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ సీహెచ్ శ్రీదేవి, పట్నాల నాగేంద్ర, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. తెనాలి ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. అలాగే పనికి తగిన వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు కాకుండా అనేక అవరోధాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలీ, అసోసియేషన్ నాయకులు కిరణ్‌కుమార్, శ్రీధర్, చక్రవర్తి, గోపి, దిలీప్‌కుమార్, కరిముల్లా, ప్రదీప్ కుమార్, అశోక్, ప్రశాంతి, సునీల్‌కుమార్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్ పర్సన్‌గా పఠాన్ రిజ్వాన

పొన్నూరు: పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్ పర్సన్‌గా పట్టణానికి చెందిన పఠాన్ రిజ్వాన నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రిజ్వానను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రముఖులు పాల్గొని చైర్ పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గుంతలున్నాయి.. జాగ్రత్త!



తెనాలిటౌన్ : స్థానిక వీఎస్సార్ కళాశాల వద్ద నుంచి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లే రహదారి గుంతల మాయంగా మారింది. విజయవాడ ప్రధాన రహదారి నుంచి డీఎస్పీ కార్యాలయం మీదుగా బాలాజీరావుపేటకు వెళ్లే వంతెన వరకు రహదారిపై ఏర్పడిన గుంతలు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. వర్షం పడినప్పుడల్లా గుంతల్లో నీరు చేరి వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని, జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధే ధ్యేయంగా అధికారులు పని చేయాలి

ఎంపీపీ యల్లమాటి మోహన్



మాట్లాడుతున్న ఎంపీపీ యల్లమాటి మోహన్

వేమూరు: మండల పరిషత్ అభివృద్ధే ధ్యేయంగా అధికారులందరు పని చేయాలని ఎంపీపీ యల్లమాటి మోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. వివిధ శాఖల అధికారులను రివ్యూ చేశారు.

- మండల విద్యా శాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల క్రమ సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందన్నారు. గ్రామాల్లో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండలంలో 53 మండల పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 19 పాఠశాలల్లో 20 మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్నారని ఆయన చెప్పారు.
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పి.నిర్మల మాట్లాడుతూ మండలంలో 19 వాటర్ ట్యాంక్‌లు ఉన్నాయని, వాటిని శుభ్రపరిచేందుకు మండల పరిషత్ నిధులు రూ.30 వేలు ఇప్పించాలని కోరారు.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్ మాట్లాడుతూ మండలంలో 8 వేల జాబ్ కార్డులు ఉండగా 4 వేల జాబ్ కార్డులకు పని దినాలు కల్పించడం జరిగిందని చెప్పారు.

డుమ్మా కొట్టిన అధికారులు

మండల పరిషత్ సాధారణ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, విద్యుత్, వైద్య, అటవీ శాఖ, ఎక్సైజ్, సాంఘిక సంక్షేమ శాఖ, అధికారులు డుమ్మా కొట్టారు. ఈ అధికారులపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎలాంటి చర్యలు తీసుకుంటారా? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అల్లూరు యోనబాబు, షేక్ బాజీ, పార్వతి, మండల పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రాముఖ్యతను విస్తరింపజేయాలి



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేపల్లె: సనాతనమైన హిందూ ధర్మ ప్రాముఖ్యతను గ్రామగ్రామాన విస్తరింపజేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని నల్లూరు సౌత్ రామాలయంలో శుక్రవారం జరిగిన ధార్మిక సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణను ధార్మిక సమితి బాధ్యతగా తీసుకోవాలన్నారు. తల్లి లాంటి హిందూ ధర్మాన్ని వీడరాదన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శమైన హిందూ ధర్మాన్ని ఆచరించటం, ఆచరింపజేయటం హిందువుల కర్తవ్యమన్నారు. ధర్మ పరిరక్షణలో భాగంగా శ్రీవాణి ట్రస్ట్, సమరసత సేవా ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ప్రతి నెల గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ధార్మిక కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సభ్యులు చింతల మురళీకృష్ణ, సుందరరావు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వలివేరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం



వలివేరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

చుండూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం అన్ని రంగాల ప్రజలను మోసం చేస్తోందని మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణా రెడ్డి అన్నారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం ఐదవ రోజు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలు, రైతులను ఎలా మోసం చేశారు.. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు ఎన్నికల తర్వాత పూర్తిగా మర్చిపోయారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, చీడేపూడి దేవేంద్ర రెడ్డి, తమ్మా రామకృష్ణా రెడ్డి, ఈమని శ్రీనివాసరెడ్డి, చీడేపూడి శ్రీనివాస్ రెడ్డి, దాసరి వసంతరావు, భీమవరపు శివనాగేంద్ర రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుంది

ప్రధానోపాధ్యాయురాలు కురగంటి భారతి



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం భారతి

తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వలన క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయురాలు కురగంటి భారతి పేర్కొన్నారు. కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో శుక్రవారం ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తించే అవకాశం ఉందన్నారు. 8,9 తరగతులు చదివే 81 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ కొడాలి గోవర్ధన్, 22వ ఆంధ్ర బెటాలియన్ అధికారులు సుబేదార్ రాజేష్‌కుమార్, హవల్దార్ చరణ్, హవల్దార్ రామన్ ఠాగూర్, గర్ల్స్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ నవ్య, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల కేటాయింపులో వివక్ష

సీనియర్ ఇంజనీరింగ్ అధికారికి అవమానం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ ఇంజినీరింగ్ పనిచేస్తున్న వ్యక్తిని అధికారులు అవమానించారు. కొద్ది రోజులు వరకు ఇన్‌ఛార్జి ఎంఈగా పనిచేసిన ఆయనకు కేవలం ఏడు వార్డులు మాత్రమే కేటాయించి మిగిలిని 33 వార్డులను ఇద్దరు డీఈలకు కేటాయించడం మున్సిపల్ కార్యాలయంలో చర్చానీయాశంగా మారింది. వివరాలోకి వెళితే.. తెనాలి పురపాలక సంఘ పరిధిలో సీనియర్ డీఈగా ఆకుల శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. తెనాలి పట్టణంలోని 40 వార్డులను మూడు భాగాలుగా విభజించి అధికారులు డీఈలకు అప్పగించే వారు. వారి పరిధిలో జరిగే వివిధ రకాల అభివృద్ధి పనులను వారే పర్యవేక్షిస్తూ వచ్చేవారు. ఇతను సుమారు రెండేళ్ల నుంచి తెనాలిలో పనిచేస్తూ వచ్చారు. ఏడాది క్రితం నుంచి ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజనీర్‌గా కూడా వ్యవహరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలల్లో నూతన ఎంఈ విధుల్లో చేరడంలో ఆయన డీగా కొనసాగుతున్నారు. శుక్రవారం జరిగిన వార్డుల కేటాయింపులో నూతనంగా వచ్చిన ఇద్దరు డీఈల్లో కె.శ్రీనివాసులుకు 1 నుంచి 15 వార్డులు, అంకాల శ్రీనివాసరావుకు 16 నుంచి 32వార్డులు కేటాయించారు. సీనియర్ డీఈ ఆకుల శ్రీనివాసరావుకు 33 నుంచి 40 వార్డులు మాత్రమే కేటాయించడం పలు విమర్శలకు తావిస్తుంది. ఆయన త్వరలో ఎంఈగా పదోన్నతి కూడా పొందే అవకాశం ఉంది. అలాంటి వ్యక్తిని అధికారులు కావాలని అవమానించారనే ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతుంది. మొత్తం మీద వార్డుల విభజన వివాదాస్పదంగా మారిందని చెప్పవచ్చు.

ఫొటోగ్రఫీతో మధురజ్ఞాపకాలు పదిలం

తెనాలిఅర్బన్: మధురమైన జ్ఞాపకాలను పదికాలాల పాటు పదిలంగా ఉంచేది ఫొటోగ్రఫీ అని హైదరాబాద్‌కు చెందిన కేనన్ సంస్థ ప్రతినిధి దనిశెట్టి రాంబాబు పేర్కొన్నారు. తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో కేనన్ ఎక్స్‌పోను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఫొటోగ్రఫీలోని మెళకువలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఫొటోగ్రాఫర్ల సందేహాలను నివృతి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుద్దపల్లి సాంబశివరావు, కార్యదర్శి వి.మణికాంత్, నాయకులు శేఖర్, మహేష్, సందీప్, గౌతమ్, సాయి, సుబ్రమణ్యం, రాంబాబు పాల్గొన్నారు.